కబడ్డీ చాంప్స్ వరంగల్, నల్లగొండ

విజేతలకు ట్రోఫీలు అందజేసిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ చౌరస్తా, జనవరి 18: 'స్కూల్ గేమ్స్ ఫెడరేషన్' ఆధ్వర్యంలో జనగామలో నిర్వహించిన అండర్-14 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో వరంగల్, నల్లగొండ విజేతలుగా నిలిచాయి. గురువారం హోరాహోరీగా జరిగిన బాలుర ఫైనల్లో వరంగల్ 51-35తో నల్లగొండపై ఘన విజయం సాధించింది. బాలికల తుదిపోరులో నల్లగొండ 48-42తో వరంగల్‌పై గెలిచింది. పోటీల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 'విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి. రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జాతీయ స్థాయికి వెళుతున్న ప్లేయర్లకు తగిన ప్రోత్సాహం అందిస్తాం' అని అన్నారు. విజేతలకు, రన్నరప్ జట్లకు ఆయన ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాము, చైర్‌పర్సన్ జమున, కౌన్సిలర్లు, వెంకటేశ్వర్లు, రవి కుమార్, హెచ్ఎం శ్రీనివాస్, ఎస్వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోటార్‌స్పోర్ట్స్‌లోకి ఇండీ రేసింగ్

ఎఫ్ఐఎం ఎక్స్‌ప్లోరర్‌లో తొలి భారత జట్టుగా పోటీలోకి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భారత్ రేసింగ్‌కు చిరునామాగా మారబోతున్నది. ఇప్పటికే ఫార్ములా-ఈ చాంపియన్‌షిప్‌తో రేసింగ్‌ను ఆస్వాదించిన దేశ అభిమానులు.. త్వరలో మోటార్‌రేసింగ్‌తో కొత్త అనుభూతి పొందనున్నారు. ఈ ఏడాది నుంచి అంతర్జాతీయ మోటార్‌సైకిల్ సమాఖ్య(ఎఫ్ఐఎం) ఈ-ఎక్స్‌ప్లోరర్‌లో భారత్ నుంచి ఇండీ రేసింగ్ టీమ్ తొలిసారి బరిలోకి దిగుతున్నది. హైదరాబాద్‌కు చెందిన కంకణాల స్పోర్ట్స్ గ్రూపు (కేఎస్‌జీ) ఇండీ రేసింగ్ టీమ్‌ను సొంతం చేసుకుంది. రానున్న తొమ్మిదేండ్ల కాలానికి ఎఫ్ఐఎంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు కేఎస్‌జీ గ్రూపు వ్యవస్థాపకులు కంకణాల అభిషేక్‌రెడ్డి గురువారం మీడియా భేటీలో పేర్కొన్నారు. ఇండీ రేసింగ్ డ్రైవర్లు ఐశ్వర్య, శాండ్రా గోమెజ్‌తో కలిసి అభిషేక్ మాట్లాడారు. ఈ ఏడాది నవంబర్‌లో హైదరాబాద్‌లో రేసింగ్ సీజన్ ఫైనల్ జరుగనుందని పేర్కొన్నారు.

పోరాడినా..

రాంచీ: ఎఫ్ఐహెచ్ ఒలింపిక్ క్వాలిఫయర్స్ టోర్నీ సెమీఫైనల్లో జర్మనీపై గెలిచి పారిస్ బెర్తు దక్కించుకుందామనుకున్న భారత మహిళల హాకీ టీమ్‌కు నిరాశ ఎదురైంది. గురువారం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో భారత్ 3-4(పెనాల్టీ షూటౌట్)తో జర్మనీ చేతిలో ఓడింది. అయితే టోర్నీలో తొలి మూడు స్థానాల్లో నిలిచే జట్లు ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి. దీంతో జపాన్‌తో వర్గీకరణ మ్యాచ్‌లో గెలిచి బెర్తు దక్కించుకోవాలని భారత్ కసితో ఉంది.

భారత్ ఓటమి

దోహా: ఏఎఫ్‌సీ ఆసియా కప్‌లో భారత్ వరుస ఓటముల పరంపర కొనసాగుతున్నది. గురువారం జరిగిన గ్రూపు-బీ లీగ్ మ్యాచ్‌లో భారత్ 0-3తో ఉజ్బెకిస్థాన్ చేతిలో ఓటమిపాలైంది. గత మ్యాచ్‌లో ఆసీస్‌పై అద్భుత పోరాట పటిమ కనబరిచిన టీమ్‌ఇండియా..ఉజ్బెకిస్థాన్‌పై చేష్టలుడిగిపోయింది. ఉజ్బెకిస్థాన్ తరపున ఫజయుల్లెవ్(4ని), ఇగోర్ సెర్గీవ్(18ని), నస్రుల్లెవ్(45ని) గోల్స్ చేశారు. ఈ నెల 23న సిరియాతో భారత్ తలపడుతుంది.

కుర్రాళ్ల కదనోత్సాహం

నేటి నుంచి అండర్-19 ప్రపంచకప్

డిఫెండింగ్ చాంపియన్‌గా యంగ్‌ఇండియా

బ్లూమ్‌ఫాంటైన్ (దక్షిణాఫ్రికా): యువ ఆటగాళ్ల ప్రతిభకు పరీక్షలాంటి అండర్-19 ప్రపంచకప్‌నకు వేళైంది. దక్షిణాఫ్రికా వేదికగా.. శుక్రవారం నుంచి యంగ్ వరల్డ్‌కప్ ప్రారంభం కానుంది. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు గడించిన ఎందరో ఆటగాళ్లు గతంలో ఈ మెగాటోర్నీలో మెరిసిన వారే కాగా.. ఇప్పుడు కూడా యువతరం తమను తాము నిరూపించుకునేందుకు తహతహలాడుతున్నది. యువరాజ్ సింగ్, మహమ్మద్ కైఫ్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జడేజా, పంత్, ఇషాన్ కిషన్, గిల్ వంటి ఎందరో ఆటగాళ్లు గతంలో అండర్-19 స్థాయిలో అదరగొట్టినవారే. ఈ టోర్నీలో 16 జట్లు పాల్గొంటుండగా.. వాటిని నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. బంగ్లాదేశ్, ఐర్లాండ్, అమెరికాతో కలిసి డిఫెండింగ్ చాంపియన్ భారత్ (గ్రూప్-'ఏ' నుంచి పోటీ పడుతున్నది. యువ భారత్‌కు ఉదయ్ సారథ్యం వహిస్తుండగా.. ఇప్పటికే ఐపీఎల్ అవకాశం దక్కించుకున్న తెలంగాణ కుర్రాడు అరవల్లి అవనీశ్ రావు, అర్షిన్ కులకర్ణిపై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రతి రెండేండ్లకోసారి జరిగే ఈ టోర్నీని ఇప్పటి వరకు 14 సార్లు నిర్వహించగా.. అందులో అత్యధికంగా భారత్ ఐదు సార్లు జగజ్జేతగా నిలిచింది. ఆ తర్వాత ఆస్ట్రేలియా మూడు సార్లు టైటిల్ నెగ్గగా.. పాకిస్థాన్ రెండు సార్లు గెలిచింది. వెస్టిండీస్ వేదికగా జరిగిన 2022 టోర్నీలో యష్‌ధుల్ సారథ్యంలోని యంగ్‌ఇండియా అదరగొట్టింది. ఇంగ్లండ్‌తో ఫైనల్లో రాజ్ బవా ఆల్‌రౌండ్ మెరుపులు మెరిపించడంతో ఘన విజయం సాధించింది. ఈ టోర్నీలో అత్యంత విజయవంతమైన జట్టుగా కొనసాగుతున్న భారత్.. గత నాలుగు టోర్నీల్లోనూ ఫైనల్‌కు చేరడం గమనార్హం. ఈ మెగా టోర్నీలో అవనీశ్‌తో పాటు మురుగన్ అభిషేక్ తెలంగాణకు చెందినవాడు. తొలి రోజు దక్షిణాఫ్రికాతో వెస్టిండీస్, ఐర్లాండ్‌తో అమెరికా తలపడనున్నాయి. శనివారం తమ తొలి పోరులో బంగ్లాతో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది.

నాగల్‌కు నిరాశ

రెండో రౌండ్‌లో ఓడిన భారత ప్లేయర్ • బ్లింకోవా సంచలన విజయం

స్వియాటెక్, అల్కరాజ్ ముందంజ • ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్

ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌లో భారత యువ ఆటగాడు సుమిత్ నాగల్ పోరాటం ముగిసింది. తొలి పోరులో సీడెడ్ ప్లేయర్‌కు షాకిచ్చిన నాగల్.. రెండో రౌండ్‌లో పరాజయం పాలయ్యాడు. మహిళల విభాగంలో గ్రాండ్‌స్లామ్ చరిత్రలోనే సుదీర్ఘంగా సాగిన టైబ్రేకర్‌లో మూడో సీడ్ రిబాకినాపై బ్లింకోవా విజయం సాధించగా.. టాప్ సీడ్ స్వియాటెక్, అజెరెంక, ఒస్టపెంకో మూడో రౌండ్‌లో అడుగుపెట్టారు.

నాగల్

మెల్‌బోర్న్: సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ టోర్నీ.. ఆస్ట్రేలియా ఓపెన్ రెండో రౌండ్‌లో భారత యువ టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నాగల్ ఓటమి పాలయ్యాడు. క్వాలిఫయింగ్ టోర్నీతో పాటు తొలి రౌండ్‌లో అద్వితీయ ప్రదర్శనతో చరిత్ర తిరగరాసిన నాగల్.. రెండో రౌండ్‌లో అదే జోరు కొనసాగించలేకపోయాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో నాగల్ 6-2, 3-6, 5-7, 4-6తో జున్‌చెంగ్ షాంగ్ (చైనా) చేతిలో ఓడాడు. తొలి సెట్‌లో నాగల్ పూర్తి ఆధిపత్యం కనబర్చగా.. ఆ తర్వాత వైల్డ్ కార్డ్ ద్వారా వచ్చిన షాంగ్ దుమ్మురేపాడు. దాదాపు మూడు గంటల పాటు సాగిన పోరులో 7 ఏస్‌లు కొట్టిన నాగల్ 37 విన్నర్లు బాదగా.. 8 ఏస్‌లు సంధించిన షాంగ్ 55 విన్నర్లతో ముందంజలో నిలిచాడు. రెండో రౌండ్‌లో ఓడినప్పటికీ 26 ఏండ్ల నాగల్‌కు దాదాపు కోటి రూపాయల నగదు బహుమతి దక్కనుంది. మరోవైపు పురుషుల డబుల్స్‌లో భారత సీనియర్ ప్లేయర్ రోహన్ బోపన్న జంట రెండో రౌండ్‌లో అడుగుపెట్టింది. తొలి రౌండ్‌లో బోపన్న-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ 7-6, (7/5), 4-6, 7-6 (10/2)తో జేమ్స్ డక్‌వర్త్-మార్క్ పోల్‌మన్స్ జంటపై గెలిచింది. మరో భారత జోడీ విజయ్ సుందర్ ప్రశాంత్-అనిరుధ్ చంద్రశేఖర్ పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్ ఇతర మ్యాచ్‌ల్లో రెండోసీడ్ అల్కరాజ్ 6-4, 6-7 (3/7), 6-3, 7-6 (7/3)తో సాన్జెపై.. మూడో సీడ్ మెద్వెదెవ్ 3-6, 6-7 (1/7), 4-6, 7-6 (7/1), 6-0తో రుసువోరీపై.. దిమిత్రోవ్ 6-3, 6-2, 4-6, 6-4తో కొక్కినాకిస్‌పై.. జ్వెరెవ్ 7-5, 3-6, 4-6, 7-6 (7/5), 7-6 (10/7)తో కెలిన్‌పై గెలుపొందారు.

భళా బ్లింకోవా

ఆస్ట్రేలియా ఓపెన్ మహిళల సింగిల్స్‌లో సంచలనం నమోదైంది. మెల్‌బోర్న్‌లో మేజర్ టెన్నిస్ టోర్నీల చరిత్రలోనే సుదీర్ఘమైన టైబ్రేకర్ అభిమానులను అలరించింది. నిరుడు ఇక్కడ రన్నరప్‌గా నిలిచిన మూడో సీడ్ రిబాకినాపై అన్నా బ్లింకోవా అద్భుత విజయం సాధించింది. మూడు గంటల పాటు సాగిన పోరులో అన్‌సీడెడ్ బ్లింకోవా 6-4, 4-6, 7-6 (22/20)తో రిబాకినాను మట్టికరిపించింది. చివరి సెట్‌లో ఇరువురు ప్లేయర్లు కొదమ సింహాల్లా పోరాడగా.. ఒత్తిడిని జయిస్తూ నిలిచిన బ్లింకోవా విజయ దరహాసం చేసింది. అరగంటకు పైగా సాగిన టై బ్రేకర్ హోరాహోరీగా సాగగా.. మ్యాచ్ అనంతరం వణికిపోతున్న శరీరంతో బ్లింకోవా 'సాధించాను' అంటూ బిగ్గరగా అరిచి సంబురాలు చేసుకుంది. ప్రపంచ నంబర్ వన్ ఇగా స్వియాటెక్ 6-4, 3-6, 6-4తో కాలిన్స్‌పై గెలిచింది.

బ్లింకోవా

క్వార్టర్స్‌లో ప్రణయ్

న్యూఢిల్లీ: భారత స్టార్ షట్లర్లు ప్రణయ్, సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి ఇండియా ఓపెన్ క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించారు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీ పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో గురువారం ప్రణయ్ 20-22, 21-14, 21-14తో భారత్‌కే చెందిన ప్రియాన్షు రజావత్‌పై విజయం సాధించాడు. 76 నిమిషాల పాటు సాగిన పోరులో ప్రణయ్‌కు ప్రియాన్షు గట్టి పోటీ నిచ్చాడు. పురుషుల డబుల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ సాత్విక్-చిరాగ్ జోడీ 21-14, 21-15తో లూ చింగ్-యాంగ్ పో హాన్ (చైనీస్ తైపీ) ద్వయంపై గెలిచింది.

సౌత్‌జోన్ టీమ్‌లో త్రిష, మమత

హైదరాబాద్, ఆట ప్రతినిధి: బరోడా వేదికగా ఈ నెల 30నుంచి మొదలయ్యే మహిళల ఇంటర్-జోనల్ వన్డే ట్రోఫీలో హైదరాబాద్ క్రికెటర్లు త్రిష, మమత చోటు దక్కించుకున్నారు. వీరిద్దరు సౌత్‌జోన్ టీమ్ తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. శ్రేయాంక పాటిల్ సారథ్యం వహించనున్న సౌత్‌జోన్ జట్టులో హైదరాబాదీ యువ క్రికెటర్ ప్రణవి చంద్ర స్టాండ్‌బైగా ఎంపికైంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.